చల్లని వాతావరణం.

వెచ్చని దుప్పటి....... మెత్తటి పరుపు.........

చిక్కడి నిశ్శబ్దం......

పల్చని వెల్తురు.

ఎక్కడున్నాడు తాను? చుట్టూ చూశాడు సురేష్. రెండువేపులా నిలువెత్తున కర్టన్స్. మిగతా రెండు వేపులా పాలరాతి గోడలు.

ఆ రంగులోనే కలసిపోతూ ఓ తలుపు.

కొంపదీసి మళ్ళీ రాజ్యలక్ష్మి రూమ్‌లో....కంగారుగా తన పక్కన చూశాడు. హమ్మయ్య! విశాలమైన ఆ మంచం మీద తనొక్కడే వున్నాడు. అంచేత యిది హోటల్ రూమ్ కాదు. రాజ్యలక్ష్మి తాలూకూ గది అసలే కాదు. అయితే మరిది కలా?
లేక హాంగోవరయినా అయుండాలి.

డార్క్ డెవిల్‌ని కలుసుకోలేదు గనుక హాంగోవర్‌కి ఆస్కారం లేదు. కనుక కలే అయుండాలి. కళ్ళు నులుముకున్నాడతను. కలలాగా అనిపించటం లేదు

"నైన్ మిలాకర్ చైన్ చురానా కిస్ కా హైయే కామ్

అరె హమ్‌సే పూచో హమ్ కో పతాగై ఉఫ్ జాలిమ్‌కానామ్" అంటూ తన కిష్టమైన పాట పాడాడు. అక్కడా తెలిసిపోతోంది కల కాదని

జరుగుతున్నది కలో నిజమో తెలుసుకోవడానికి చాలాసార్లు తులసిని మీదకు లాక్కునేవాడు . ఆ రగిలే వేడిలో రుజువయేది కలో నిజమో. మరోసారి కలియచూశాడతను. ఖాళీ! తులసి లేదు. అంటే యిది తన యిల్లు కూడా కాదు.

కొంచెంగా భయం మొదలయింది ఎందుకో తెలీదు. హఠాత్తుగా గుర్తుకొచ్చిందతనికి తను వప్పుకున్న ఉద్యోగం.

లక్ష రూపాయలు తులసి ఎకౌంట్‌లోకి వచ్చింది. అది నిజమా కాదా అనేదే తెలీటం లేదు. అది కూడా కలేనేమోనని అనుమానం. అవునూ తనూ, తులసి కలిసి బ్యాంక్ కెళ్ళారు కదా! లక్ష రూపాయలు ఆమె ఎకౌంట్‌లో వుందని బ్యాంక్ క్లర్క్ చెప్పింది. మరి ఆ తరువాతేం చేశాడు తను?

లేచి మంచం దిగబోయాడు సురేష్. కాళ్ళకు స్లిప్పర్స్ చల్లగా తగిలాయ్. ఆశ్చర్యంగా వాటి వైపు చూశాడు. కొత్తవి....తనవి కానేకావు.

ఆందోళన ఎక్కువై పోతోంది.

ఎవరివవి???

స్లిప్పర్స్ తొడుక్కుని కర్టెన్ దగ్గరకు నడిచి ఓ కర్టెన్ పక్కకు తొలగించి చూశాడు.

గదంత ఎత్తున కూలింగ్ గ్లాసెస్. వాటిల్లో నుంచి బయటి దృశ్యం మనోహరంగా కనబడుతోంది. తను ఆ భవనం తాలూకూ అయిదారు అంతస్తులపైన వున్నాడు. తన చుట్టూ పూలమొక్కలూ, చెట్లూ దూరంగా అందమైన భవనాలు.

ఎవరిదీ భవనం?

తనెలా వున్నాడిందులో?

వెనక్కు తిరిగి గదంతా మరోసారి చూశాడతను.

ఓ మూలగా తలుపు అవుట్ లైన్ కనబడుతోంది. మధ్యలో డోర్ నాబ్. పెద్ద అంగలతో వెళ్ళి తెరచి లోపలకు చూశాడు. అది బాత్ రూమ్. లోపలకు చూస్తూనే వులిక్కిపడ్డాడతను.

గుండె ఝల్లుమంది. ఓ వ్యక్తి తనవేపే చూస్తూ కన్పించాడు......గొంతు తడారిపోయింది. నోట్లో నుంచి మాట రాలేదు.

పెదాలు కదిలినాయి.

ఎదురుగ్గా వున్న వ్యక్తి పెదాలు కూడా అచ్చం తనలాగే కదిలినాయి.

తనలాగే అతనూ అటువేపు నుంచి మరో తలుపు తెరచి తొంగి చూస్తున్నాడు.

"హలో " అన్నాడు అతికష్టం మీద.

అదే సమయానికి అతనూ హలో అన్నాడు.

ఇప్పుడు వచ్చింది అనుమానం.

అదిరిపడ్డాడు. హైఓల్టేజి షాక్ తగిలినట్లయింది. చటుక్కున లైట్ స్విచ్ వేశాడు. లైటు వెలిగింది. ఎదురుగ్గా వున్నది అద్దం! నిజంగా మనిషి కాదు. మరో ఆలోచన మరింత భయంకరంగా చొరబడింది.

ఈసారి అద్దంలో తన ప్రతిబింబం కన్పించాలి కాని అతనెవరు? గిర్రున వెనక్కి తిరిగి చూశాడు. తనవెనుక ఎవరయినా నిలబడి వున్నారేమోనని? ఎవరూ కనిపించలేదు. మరి ఆ అద్దంలో కన్పిస్తున్న ప్రతిబింబం ఎవరిది?

భయం వెన్నులో పాకుతోంది నెమ్మదిగా.

మరోసారి అద్దంలోకి చూశాడు. అదే వ్యక్తి నోరు తెరచుకుని కంటిపాపలు బయటకు దూసుకొచ్చేట్లుగా..... ఎదురుగ్గా నిలబడ్డ మృత్యువుని చూస్తున్నట్లు .......

మెదడు మొద్దుబారిపోతోంది. నిశ్చేష్టుడయిపోయాడు కొద్దిక్షణాల పాటు. అది అద్దమేగానీ అద్దంలో ప్రతిబింబం తనది కాదు...... కనీసం తన పోలికలు కూడా లేవు మరి ఎవరతను.....? ఎవరిదా ప్రతిబింబం???

పది అంతస్తుల భవనం మీదనుంచీ తలక్రిందులుగా పడిపోతున్నట్లన్పిస్తోందతనికి.

చెమటలు పట్టేసినయ్. చేత్తో ముఖం తుడుచుకున్నాడతను. ప్రతిబింబం కూడా

అచ్చం తనలాగే ముఖాన్ని తుడుచుకుంటూ......

అసలది నిజంగా అద్దమేనా? ఫ్రేమ్ వెనుక ఎవరయినా......

అద్దాన్ని చేత్తో తడిమాడు.

చేతికి పక్షవాతం వచ్చినట్లు కదులుతోంది అద్దం మీద.

అద్దమే అది! సందేహం లేదు. అందులో కన్పించేది కూడా తన రూపమే ! కానీ తను మాత్రం కాదు. ముఖ్యంగా ముఖం. ఇంకొద్ది క్షణాలు అలాగే చూస్తూ నిలబడితే గుండె ఆగిపోతుందేమో అన్పిస్తోంది. అంత వేగంగా కొట్టుకుంటోంది.

ఆ షాక్ నుంచి తేరుకోడానికి చాలా సేపు పట్టిందతనికి.

వెనక్కు తిరిగివచ్చి మంచం మీద కూర్చున్నాడు. కాళ్ళు వణుకు తున్నాయి. బ్లడ్ ప్రెజర్ పెరిగిపోయింది......ఆలోచించేంత శక్తి కూడా లేదు.

మరోసారి ముఖాన్ని తన చేత్తో తడుముకున్నాడు సురేష్.

అదివరలా లేదా స్పర్శ. కొత్తగా, వింతగా, ఇంకెవరో వ్యక్తిని స్పర్శిస్తున్నట్లు...

ఏం జరిగిందసలు? ఎలా జరిగిందిది? అద్దంలో కన్పించే వ్యక్తి మొహంలా తన మొహం ఎందుకు మారింది? అసలు తనెలా వుండేవాడు? అతని కళ్ళముందు తన రూపం గజిబిజిగా కనబడుతోంది. కానీ ఆ వ్యక్తి మొహం కూడా కనబడుతోంది దాంతోపాటు.

పిచ్చెక్కిపోతుందేమో అన్న అనుమానం....

ఉలిక్కిపడ్డాడతను... తన మానసిక పరిస్థితి సరిగ్గా వుందా అసలు? ఒకవేళ తనకు పిచ్చెక్కటం గానీ... ఎక్కబోవటానికి గానీ... ఇది నాంది కాదుగదా?

మళ్ళీ లేచి నిలబడ్డాడతను కంగారుగా. గదిలో మరోమూలకు వున్న డ్రస్సింగ్ టేబుల్ దగ్గరకు నడిచాడు. లోలోపల ఎక్కడో అశ. ఎక్కడో... కొంత ఆ అద్దంలోనయినా తన అసలు రూపం కనబడుతుందేమోనని.

అద్దం దగ్గరకొస్తూనే మొహం పాలిపోయింది.

"ఉహు" అంతకుముందు కన్పించిన ముఖమే. ఖచ్చితంగా తనది కాదది.

తనను తను గుర్తుపట్టలేని స్థితిలో లేడతను.

తలపోటు మొదలయిందతనికి. తల పేలిపోతుందేమో అన్పిస్తోంది. అక్కడే కుర్చీలో నిస్సత్తువగా కూలబడిపోయాడు. ఏమిటి మిష్టరీ? ఏం జరుగుతోంది?

"గుడ్ మార్నింగ్ సురేష్ " తీయని గొంతు సన్నగా.. వీణలా మోగింది.

ఎవరో హఠాత్తుగా గాల్లోకి ఎగరేసినట్లుగా ఎగిరి నిలబడ్డాడు.

గోడలో కలిసిపోయినట్లున్న తలుపు తెరచుకుని ఓ యువతి లోపలకొస్తోంది. తెల్లగా మిరుమిట్లు గొలిపేంత అందం...

పెదాల మీద ఆకర్షణీయంగా చిరునవ్వు!

ఆమెవంకే కళ్ళప్పగించి చూస్తూండి పోయాడతను.

ఆమె చేతి మీద ఓ రంగురంగులు చిలక...చిన్నది... కూర్చుని వుంది. ఎవరీ దేవత? ఈ మిస్టరీలో మరో భాగమా?

"రాత్రి బాగా నిద్ర పట్టిందనుకుంటాను...." సోఫాలో కూర్చుంటూ అంది ఆమె. మాట్లాడుతున్నా ఆమె పెదాల మీద చిరునవ్వు అలానే వుంది.

"రాత్రి బాగా నిద్ర పట్టిందనుకుంటాను?" అంది చిలుక కూడా.

"మీకు క్షమార్పణ చెప్పుకోడానికి వచ్చాను మిస్టర్ సురేష్... మీ మీద సర్వాధికారాలూ మాకున్నా... మిమ్మల్ని సంప్రదించకుండా మిమ్మల్ని వుపయోగించుకోవటం అంత భావ్యం కాదని తెలుసు- అయినా తప్పలేదు."

సురేష్ గుండె ఘల్లుమంది.

అంటే...అంటే...ఇది తను వప్పుకున్న వుద్యోగంలో ఒక భాగమా? ఇదంతా ఆ సహదేవ్ చేసినదేనా?

"ముందు నాకో విషయం చెప్తారా?" త్వరగా కోలుకుంటూ అడిగాడతను. అతని మాటలను పట్టించుకోనట్లు మాట్లాడిందామె.

"మీకు తెలీకుండా మిమ్మల్నిక్కడికి తీసుకురాక తప్పలేదు. మీరు చేయబోయే ఉద్యోగానికది ముఖ్యం. మీరు అన్నివిధాలా సహకరిస్తే... మాకెంతో హాయిగా వుంటుంది."

సురేష్‌కి అసహనంగా వుంది.

"ముందు నాకేం జరిగిందో చెప్పండి? నా మొహం ఎలా మారిపోయింది?" అందోళనగా అన్నాడతను.

ఆమె నవ్వింది.

"అదీ మీ ఉద్యోగంలో ఒక భాగమే మిస్టర్ సురేష్! మీరు అర్జున్‌ని పోలి వుండటం అవసరం. అందుకని మా డాక్టర్లు మీ మొహంలో కొన్ని ప్రాథమికమయిన మార్పులు చేశారు.... ప్లాస్టిక్ సర్జరీ."

సురేష్‌కి కోపం ముంచుకొచ్చింది.

"నేను మీతో ఉద్యోగం చేస్తానని చెప్పానుగానీ ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకుంటానని చెప్పలేదు."

"బహూశా మీకు గుర్తు లేదేమో- ఈ ఆరు నెలలూ మీ మీద సర్వాధికారాలూ మాకే వుంటాయని సహదేవ్‌గారు మీకు చెప్పారు".

అతనికేం మాట్లాడాలో తెలీలేదు.

"దానర్థం-నా శరీరం కూడా మీకిచ్చేస్తానని ఎలా అవుతుంది? మీ అర్జున్ ఎవరు? అతనిలాగా నన్నెందుకు మార్చటాం?"

"అర్జున్ మావారు! కొన్ని కారణాలవలన ఆయనను పోలిన వ్యక్తి మాకు అవసరమయ్యాడు. పూర్తిగా మా బిజినెస్‌కు సంబంధించిన కారణాలు! అయినా మీరు అదివరక్కంటే స్మార్ట్ గా వున్నారని సహదేవ్ అంటున్నాడు....మరోసారి అద్దంలో చూసుకోండి."

చిలుక కూడా వెంటనే అందుకుంది..."మరోసారి అద్దంలో చూసుకోండి."

ఆమె చిలుకను ముద్దు పెట్టుకుంది.

"మీకు లక్ష రూపాయలు ఊరికే ఇవ్వలేదు సురేష్ గారూ! మీ పూర్తి సహకారాన్ని మేము కొనుక్కున్నాము."

ఆమె గొంతులో బెదిరింపు స్పష్టంగా తెలుస్తోంది.

తను చాలా పెద్ద తప్పు చేశాడు. ఈ ఉద్యోగానికి వప్పుకుని, ఇదంతా ఏదో పెద్ద వలలాగుంది. తనను ఎలా ఉపయోగించుకోబోతున్నారో అర్థం కావటంలేదు.

"మీరు ఉద్యోగానికి వప్పుకున్నందుకు మాకెంతో ఆనందంగా వుంది" కొద్ది క్షణాల తర్వాత అందామె.

"మాకెంతో ఆనందంగా వుంది" అంది చిలుక కూడా.

"ఊరికే వప్పుకోలేదు, డబ్బు కోసం ...." కటువుగా అన్నాడు అతను.

"అఫ్‌కోర్స్ మీకు డబ్బే ముఖ్యం అని తెలుసు."

"నాకీ విషయం చెప్పండి... మళ్ళీ నా ముఖం ఒరిజినల్‌గా మారే అవకాశం వుందా?"

"సాధ్యం కాదని డాక్టర్లు అన్నారు... ఇంతకుముందు ఇంకో అతను... అతని పేరు వినయ్-కూడా మీలాగే మళ్ళీ తన ఒరిజినల్ రూపం కావాలని పేచీ పెట్టుకున్నాడు. వీలు కాదని ఎంత చెప్పినా వినకుండా ఇక్కడినుంచి తప్పించుకుని పారిపోయాడు... పోలీస్ రిపోర్ట్ ఇవ్వటానికి. కానీ ఏం లాభం? పోలీస్ స్టేషన్‌కి చేరుకోకముందే చచ్చిపోయాడు"

మళ్ళీ భయం శరీరమంతా పాకింది సురేష్‌కి.

"చచ్చిపోయాడా?"

"అవును! అన్నట్లు మా విష్ణు గది బయటే వుంటాడు. మీకెలాంటి భోజనం కావాలో అతనికి చెప్తే ఆ విధంగానే ఎరేంజ్ చేస్తాడు."

సురేష్‌కి దృష్టి భోజనం మీద లేదు.

"ఆ వినయ్ ఎలా చచ్చిపోయాడు?" అడిగాడు అనుమానంగా.

"అదా!" నవ్విందామె "మామూలు యాక్సిడెంట్! ఒక నల్లని కారు దొంగ నెంబరు ప్లేట్‌తో అతని మీద నుంచి వెళ్ళిపోయింది. అక్కడికక్కడే చచ్చిపోయాడు."